
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 16.0

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు

సోమవారం 29 జనవరి 2024




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొత్తపల్లి

ఈ ఎన్నికల్లో పోటీ చేస్తా.. అసెంబ్లీలో అడుగుపెడతా

మాజీ మంత్రి కొత్తపల్లి

నరసాపురం, జనవరి 28: రానున్న ఎన్నికల్లో నరసాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెడతానని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన నివాసంలో ముఖ్య అనుచరులు, అభిమానులతో సమావేశమయ్యారు. కొత్తపల్లి మాట్లాడుతూ వైసీపీకి రాజీనామా చేసేందుకు దారితీసిన పరిస్థితుల్ని వివరించారు. " నేనేంటో.. నియోజకవర్గంలోని పరిస్థితులేమిటో..అన్ని ప్రధాన పార్టీలకు తెలుసు..మీ కోరిక మేరకు నేను పోటీ చేసి గెలిచి తీరుతా" అని చెప్పారు. రెండేళ్ల క్రితం కొత్తపల్లి వైసీపీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి రాజకీయంగా దూరంగా ఉన్నారు. ఇటీవల ఓ ప్రాంతీయ పార్టీలో చేరుతున్నారంటూ ఊహాగానాలు వచ్చాయి.ఈ నేపథ్యంలో క్లారిటీ ఇస్తారని అంతా భావించారు. అయితే కొత్తపల్లి మాత్రం ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారే తప్ప ఏ పార్టీలో చేరుతానన్నది వెల్లడించలేదు.

కదన రంగంలో కమలం

భారతీయ జనతా పార్టీ ఎన్నికల కదన రంగంలోకి దిగడానికి అంతర్గతంగా భారీ కసరత్తు చేస్తోంది. పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఆశావహుల నుంచి ఇప్పటికే దరఖాస్తులను అందుకుంది. గతంలో ఒక్కో నియోజకవర్గంలో మూడంకెలు దాటకుండా బొటాబొటిగానే ఓట్లు లభించాయి. కాని ఈ మధ్య కాలంలో తమ పార్టీ పుంజుకుందని, మిగతా పార్టీలకు పోటీగా, సమానంగా నిలదొక్కుకోవడానికి సిద్ధమనే సంకేతాలను బయటకు పంపుతోంది. ఆ మేరకు పార్టీ కేడర్‌ను అప్రమత్తం చేసింది. జిల్లా అధ్యక్షులతో పాటు కోర్ కమిటీలు, క్లస్టర్ల వారీగా ఇన్‌చార్జ్‌లు, కో-ఇన్ చార్జ్‌లను తాజాగా నియమించింది. పార్టీ పదాధికారులు నియోజకవర్గాల్లో బలాబలాలపై ఇప్పటికే ఆరా తీసి నివేదికలు సిద్ధం చేశారు. రానున్న కొద్ది రోజుల్లోనే ఆ పార్టీ కీలక నిర్ణయాలు తీసుకునేందుకు అడుగులు వేస్తోంది. ఇతర పార్టీలతో పొత్తు ఉంటుందా.. లేదా ? అనేదానిపై స్పష్టత ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.



లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు భారీగా దరఖాస్తులు

సీనియర్లతోపాటు కొత్త ముఖాలు కూడా రెడీ
నిలదొక్కుకోవడానికి వీలుగా ఎత్తులు
క్షేత్రస్థాయిలో పట్టున్న వారికే ఈసారి అవకాశం
క్లస్టర్ ఇన్‌చార్జ్‌లుగా తపన చౌదరి, లక్ష్మీనారాయణ




శ్రీనివాసవర్మ లక్ష్మీనారాయణ తాతాజీ విక్రమ్ కిశోర్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి వీలుగా బీజేపీ నేతలు ఇప్పుడు క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రంగంలోకి దిగుతున్నారు. పార్టీ గతంకంటే పుంజుకుందనే ధీమాతో నేతలు ఉన్నారు. తాజాగా రాష్ట్ర నాయకత్వం మారి ఆ స్థానంలో పురందేశ్వరి పార్టీ పగ్గాలు చేపట్టడమే కాకుండా జిల్లాలను చుట్టిముట్టి వచ్చారు. జిల్లా స్థాయి కేడర్‌కు ఆమె సమయం కేటాయిస్తుండడం, అదనుగుణంగానే పార్టీ నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే రంగంలోకి దిగి, సర్దుబాటు చేయడం వంటి చర్యల్లో ఈమధ్యన పురోగతి కనిపిస్తోంది. ప్రత్యేకించి జిల్లా అధ్యక్ష స్థానాలతోపాటు కొత్త కమిటీలను నియమించారు. పాత కమిటీల్లో ఉన్న సీనియర్లకు పదోన్నతి కల్పిస్తూ వారిలో అసంతృప్తి లేకుండా జాగ్రత్తపడ్డారు. అయినా కొందరు ఈ విషయంలో వెనుకబడే ఉండడం పట్ల అసంతృప్తి లేకపోలేదు. ఏలూరు జిల్లాలో కేడర్, నియోజకవర్గ నాయకత్వాలు సమన్వయం సాధించేలా ఇప్పటివరకు తీసుకున్న చర్యలన్నీ ఫలించాయి. ఈ నేపథ్యంలోనే పొత్తు సంగతి ఎలా ఉన్నా ఎన్నికల రంగంలో నిలదొక్కుకోవడానికి వీలుగా బీజేపీ తన కేడర్‌ను అప్రమత్తం చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపన చౌదరి) ఏలూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయాలనే భావంతో ఇప్పటికే ఆయన కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు సాగిస్తున్నారు. తాగునీరు సరఫరాకు వీలుగా ట్యాంకర్ల ఏర్పాటు, కొన్ని గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం, మరికొన్ని చోట్ల సేవా కార్యక్రమాల నిర్వహణకు విరాళాలు ఇస్తూ దాదాపు చాలా నియోజకవర్గాల్లో నిలదొక్కుకున్నారు. బీజేపీ పక్షాన ఒంటరిగానైనా లేకుంటే రాష్ట్ర రాజకీయాల్లో భాగంగా ఆకస్మిక పొత్తులు ఏర్పడితే ఆ దిశగాను పోటీకి ఆయన ఇప్పటికే సమాయత్తమయ్యారు. సీనియర్లను దగ్గర చేర్చుకోవడం, కేడర్‌తో తాను సన్నిహితంగా ఉండడం ద్వారా తగిన కార్పెట్ పరచుకున్నారు. తాజాగా కొన్ని జిల్లాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఆయా క్లస్టర్లకు బీజేపీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఉత్తరాంధ్రలో అరకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి క్లస్టర్‌కు ఇన్‌చార్జిగా తపన చౌదరిని నియమించారు. ఈ మధ్యనే అనారోగ్యానికి గురైన ఆయన కొంచెం తేరుకున్నారు. తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా కదులుతున్నారు.ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆశావహుల నుంచి బీజేపీ దరఖాస్తులను అందుకుంది. పోలవరంలాంటి ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న ఆశావహులంతా ఉన్నత చదువులు చదివిన వారే. ఏలూరు జిల్లా కేంద్రం నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. వాస్తవానికి బీజేపీ బలాన్ని అంచనా వేస్తూ వస్తున్న కొంతమంది పోటీ వచ్చేసరికి తమకే టికెట్లు కేటాయించాలనే రీతిలో ఉన్నారు. ఇంతకుముందు జిల్లా అధ్యక్షులుగా కొనసాగిన వారు, వివిధ పదవుల్లో ఉన్న వారు సైతం ఇప్పుడు ఆశా వహుల జాబితాలో ఉన్నారు. పూర్వపు జిల్లా అధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ ఇప్పుడు కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, నరసాపురం, ఏలూరు క్లస్టర్‌కు ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. దీనికి తోడు పశ్చిమలో సీనియర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసవర్మ, పాకా సత్యనారాయణ వంటి నేతలంతా ఇప్పటికే ఎన్నికల కసరత్తులో నిమగ్నమై ఉన్నారు. ప్రత్యేకించి కీలక నియోజకవర్గాల్లో పోటీకి దిగేందుకు వీలుగా సన్నద్ధమవుతున్నారు.

కీలక స్థానాల్లో నువ్వా నేనా..

కీలక స్థానాల్లో పోటీ నువ్వానేనా అనేటట్టుగా మారనున్నందున ఆ మేరకు బీజేపీ సైతం తగిన అభ్యర్థులను రంగంలోకి దింపాలని యోచిస్తోంది. అందుకనే ఇప్పుడు ఎక్కడికక్కడ నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తోంది. ఆర్ఎస్ఎస్ సైతం మరోవైపు నియోజక వర్గాలపై పూర్తిగా దృష్టి పెట్టింది. ఆర్ఎస్ఎస్ పెద్దలు ఎక్కడికక్కడ తగిన నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేకించి జిల్లా అధ్యక్షులు తాతాజీ, విక్రమ్ కిషోర్‌తో పాటు మిగతా వారి పనితీరుపైన ఒక కన్నేసి ఉంచారు. ఇప్పుడు పార్టీకి అందిన దరఖాస్తులు చూస్తుంటే పార్టీకి ఇమేజ్ మరింత పెరిగినట్టుగా భావిస్తున్నామని సీనియర్లు చెబుతున్నారు. ఎందుకనంటే గతంలో ఉన్న పరిస్థితులు వేరు, ఇప్పుడున్న పరిస్థితులన్నీ పార్టీకి కాస్తంత అనుకూలంగానే కనిపిస్తున్నా యని సీనియర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఏలూరు పార్లమెంటు నుంచి గారపాటి చౌదరి పోటీకి సిద్ధంగా ఉన్నందున నరసాపురం నుంచి ఎవరిని బరిలోకి దింపుతారనే విషయంపైన లోతైన కసరత్తు చేస్తున్నారు. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఏలూరు, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ స్థానాల నుంచి దాదాపు పది మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తుంటే విద్యావంతులు, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నవారు, వివిధ వర్గాలతో సాన్నిహిత్యం పొందిన వారినే అభ్యర్థులుగా ఎన్నిక చేసే అవకాశం ఉంది. రాష్ట్ర పార్టీ కార్యదర్శి శ్రీనివాసవర్మను సైతం ఈసారి ఎన్నికల బరిలోకి దింపే యోచనలో పార్టీ ఉన్నట్టు సమాచారం.

ఎంపీ అభ్యర్థి ఎవరు ?

వైసీపీలో అన్వేషణ ..గంగరాజు కుటుంబంపై దృష్టి
నరసాపురంలో దీటైన అభ్యర్థి కోసం కసరత్తు
తాజాగా తెరపైకి న్యూస్ యాంకర్ శ్వేత వర్మ
టీడీపీ-జనసేన కూటమిలో నేనున్నానంటూ రఘురామరాజు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో నర్సాపురం ఎంపీ అభ్యర్థి కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుస్తీ పడుతోంది. ఆ పార్టీ నాయకుడు గుబ్బల తమ్మయ్యతో ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేరుగా సంప్రదించారు. ఎంపీ బరిలో ఉండాలంటూ సూచించారు. ఆర్థిక స్తోమతతో సంబంధం లేదంటూ భరోసా ఇచ్చారు. అందుకు తమ్మయ్య కూడా అంగీకారం తెలిపారు. తాజాగా మరో అభ్యర్థి కోసం పార్టీ దృష్టి సారించింది. గోకరాజు గంగరాజు కుటుంబం నుంచి ఒకరిని నిలిపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వాస్తవానికి గోకరాజు గంగరాజు కుటుంబం నుంచి పెదబుజ్జి రంగంలో ఉండే అవకాశం ఉందని గతంలో అంతా భావించారు. అయితే అందుకు ఆ కుటుంబం సుముఖత చూపలేదు. ఎంపీ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపకపోవడంతో ప్రత్యామ్నాయంగా తమ్మయ్య పేరును పరిశీలించింది. అయితే తెలుగుదేశం-జనసేన కూటమి అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని ఎంపీ రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. సంక్రాంతికి భీమవరం విచ్చేసిన ఆయన అన్ని వర్గాలతోనూ భేటీ అయ్యారు. ఎంపీ బరిలో ఉంటున్నట్టు ప్రకటించారు. అందుకు దీటైన అభ్యర్థికోసం ఇప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. క్షత్రియ సామాజిక వర్గం నుంచే బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపడానికి అన్వేషిస్తోంది. గతంలో ఎలక్ట్రానిక్ మీడియా యాంకర్‌గా పనిచేసిన శ్వేత వర్మ అనే మహిళను ఇప్పుడు ఎంపీ బరిలోకి దింపితే ఎలా ఉంటుందనే విషయాన్ని ఆరాతీస్తోంది. సదరు మహిళ కూడా గోకరాజు గంగరాజుకు దూరపు బంధువు. మరోవైపు ఎమ్మెల్యే చెరుకువాడ రంగరాజుకు బంధువుగా చెపుతున్నారు. మొత్తంపైన రఘురామకృష్ణంరాజుకు ధీటుగా అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని రంగంలోకి దింపాలని వైసీపీ యోచిస్తోంది. వైసీపీ ప్రయత్నాలు చేసిన వారంతా వెనుకంజ వేస్తూ వచ్చారు. సొంత సర్వేలు కూడా నిర్వహించుకున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్న విషయాన్ని సర్వే ద్వారా గమనించారు. దాంతో వైసీపీ తరపున పోటీ చేయక పోవడమే మేలన్న భావనకు వచ్చేశారు. తాజాగా అటు గోకరాజు, ఇటు చెరుకువాడకు బంధువైన మహిళపై వైసీపీ దృష్టి పెట్టింది. ఆమె భర్త విదేశాల్లో సాఫ్ట్‌వేర్‌గా ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. పెనుమంట్ర మండలం ఓడూరు గ్రామానికి చెందిన ఆమెను హుటాహుటిన స్వదేశానికి రప్పించారు. తాడేపల్లి ప్యాలెస్‌లో మంతనాలు చేస్తున్నారు. పార్టీయే ఆర్థిక చేయూత నిచ్చి ఎంపీ బరిలో నిలిపేందుకు ముందుకొచ్చింది. దాంతో ఆ మహిళ ఆసక్తి చూపుతున్నారు. మొత్తంపైన నరసాపురం ఎంపీ అభ్యర్థి కోసం వైసీపీ మల్లగుల్లాలు పడుతోంది.



పులి పంజా

» దేవినేనివారిగూడెంలో పశువులపై దాడి
» ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారుల సూచన
» ముండూరు సమీపంలో బోను ఏర్పాటు

7

ఓటుతోనే మన భవిష్యత్తు

వైసీపీకి స్వస్తి పలకండి

పెదఅమిరంలో మన ఓటు-మన భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మల రామానాయుడు, తోట సీతారామలక్ష్మి, మంతెన రామరాజు, కొటికలపూడి గోవిందరావు

కాళ్ళ, జనవరి 28 : దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమేనని సక్రమంగా వినియోగించుకుంటే మన భవిష్యత్‌ను కాపాడుకోవచ్చని పలువురు టీడీపీ నాయకులు అన్నారు.కాళ్ళ మండలం పెదఅమిరంలో ఆదివారం సాయంత్రం మన ఓటు-మన భవిష్యత్-మన బాధ్యత కార్యక్రమం నంబూరి వెంకట రామరాజు, తాడినాడ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ మన తలరాతను మార్చేది ఓటు హక్కు మాత్రమే సరైన వ్యక్తికి ఓటు వేయకపోతే ఎంత ఇబ్బంది పడతామో ఈనాలుగున్నర ఏళ్ళుగా చూస్తున్నామన్నారు. ప్రతీఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్యపరచాలన్నారు.ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు రాజకీయ స్వేచ్ఛ కోల్పోయారని, అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న ఈ పాలనకు 2024లో స్వస్తి పలికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి ఎంతైనా అవసరం ఉందన్నారు. సైకో విముక్త ఆంధ్రప్రదేశ్‌గా మార్చుకోవల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. శాండ్, ల్యాండ్, వైన్, తదితర వాటి ద్వారా వైసీపీ ప్రభుత్వం సంపాదించిన అక్రమ సంపాదనతో ఓట్లు కొనాలని చూస్తుందని, ఆ ఉచ్చులో మీరంతా పడొద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు వేటుకూరి వెంకట శివరామరాజు, పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, నాయకులు విడివాడ రామచంద్రరావు, పత్సమట్ల ధర్మరాజు, జుత్తిగ నాగరాజు, మేకా ఈశ్వరయ్య, వేగేశ్న కనకరాజు సూరి, ఘంటసాల వెంకటలక్ష్మీ, బీజేపీ నాయకులు పాకా సత్యనారాయణ, పెన్మెత్స వెంకటేశ్వరరాజు, కోళ్ళ నాగేశ్వరరావు, ఆరేటిప్రకాష్, మెంటే పార్థసారధి, ముత్యాల రత్నం, సుబ్బారావు, చెనమల్ల చంద్రశేఖర్, కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఎగనామం

అందని రూ.200 కోట్లు సబ్సిడీ సొమ్ము
ప్రభుత్వ సహకారం లేక సాగుకు రైతులు వెనకడుగు



భీమవరం రూరల్, జనవరి 28 : ఇదిగో ఇస్తాం.. అదిగో ఇస్తాం.. ఊరిస్తూనే రైతులను నిలువునా మోసం చేసింది వైసీపీ ప్రభుత్వం. వ్యవసాయ యాంత్రిక పనిముట్లకు సబ్సిడీ ఎగనామం పెడుతూ వచ్చింది. జిల్లాలో లక్షల మంది రైతులు దాదాపుగా రూ.200 కోట్లు వరకు యాంత్రిక పనిముట్లు సబ్సిడీ కోల్పోయారు. గడిచిన టీడీపీ ప్రభుత్వం హాయంలో ఏడాదికి ఉమ్మడి జిల్లాకు రూ.25 కోట్లు సబ్సిడీగా రైతులకు అందించడంతో పాటు ప్రజా ప్రతినిధులు కోటాలో పెద్ద ట్రాక్టర్‌లకు ఒక్కింటికి రూ.2 లక్షలు సబ్సిడీ, మండలాల వారీగా వరికోత యంత్రాలు 50 శాతం సబ్సిడీతో గ్రూపులకు అందిస్తూ వచ్చారు. అవన్నీ ప్రస్తుత ప్రభుత్వం గాలికి వదిలేసింది.

సాగుపై మక్కువ తగ్గింది..

వరిసాగులో ప్రభుత్వం విధివిధానాలు సరిగా లేకపోవడంతో రెండేళ్లుగా కౌలు రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఈ దాళ్వా సాగులో ఎకరానికి 5 బస్తాలు నుంచి 10 బస్తాలలోపే సాగు లీజుగా పడిపోయింది. గడిచిన సార్వాలో అయితే లీజు లేకుండానే సాగు చేసుకునేలా రైతులు ఆఫర్ ఇచ్చారు. ఇదంతా ప్రభుత్వం తీరువల్లే అని రైతులు అంటున్నారు. పురుగు మందుల పిచికారీ యంత్రం కొనాలంటే రూ.15 వేలు పెట్టాలి. సబ్సిడీపై గత ప్రభుత్వ హయాంలో రూ.8 వేలకే వచ్చేది. సాగు చేయలేకే వెనకడుగు వేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

బటన్ నొక్కారు..సొమ్ములేవి ?

ఆసరా కోసం మహిళల ఎదురు చూపులు
నాల్గో విడత ఒక్క రూపాయి పడలేదు
గతేడాది మూడో విడతలో మూడు నెలలు వేశారు



భీమవరం రూరల్, జనవరి 28 : సార్ బటన్ అయితే నొక్కారు. సొమ్ములు ఎప్పుడు పడతాయో అని లబ్ధిదారులు ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఈనెల 23న నాల్గో విడత ఆసరా సొమ్ములు విడుదల చేసేందుకు సభ పెట్టి సీఎం సార్ బటన్ నొక్కారు. ఇప్పటికీ ఒక్క గ్రూపునకు కూడా సొమ్ము పడితే ఒట్టు.. జిల్లాలో 27,004 గ్రూపులకు రూ.275.90 కోట్లు విడుదల అయింది. ఆసరా సొమ్ముల కోసం నెలరోజుల ముందుగానే డ్వాక్రా మహిళలచే వేలిముద్రలు వేయించుకున్నారు. ఇప్పుడు సొమ్ముల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. గడిచిన సంవత్సరం 3వ విడత సొమ్ము 27,013 గ్రూపులకు గాను రూ. 276 కోట్లు బటన్ నొక్కి విడుదల చేశారు. మూడు నెలలు వరకు గ్రూపుల వారీగా వేస్తూనే ఉన్నారు. సొమ్ము చెల్లింపులో కార్పొరేషన్ వారీగా ఎస్సీ, ఎస్టీ ముందుగా వేయడం, బీసీ రెండో లిస్టుగా, ఓసీ చివరిగా వేశారు. ఈసారి నాల్గో విడత కూడా అదే లెక్కన కార్పొరేషన్‌ల వారీగానే వేస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే ఎన్నికల సమయం దగ్గరవడంతో ఎన్నికల ముందు రోజులలో వేయడానికి ప్రణాళిక.. అనే ప్రచారం సాగుతుంది. అయితే వైఎస్ఆర్ ఆసరా పథకం అమలులో మహిళలు లబ్ధి ఎలా ఉన్నా విమర్శలు వెల్లువెత్తాయి. పథకం ద్వారా లబ్ధిపొందే మహిళలకు సమానంగా కాకుండా వ్యత్యాసం ఒక్క గ్రూపుకు అత్యల్పంగా సొమ్ము వందలు, కొన్ని గ్రూపుల మహిళలకు రూ.రెండు వేలు, మూడు వేలు, కొంత మందికే రుణాల సొమ్ములో 80 శాతం వరకు లాభించడంతో మహిళలలో నిరుత్సాహం ఎక్కువ ఉంది. సొమ్ము పొందడంలో జాప్యం, వేలిముద్రలు, ఫోటోలు హడావిడి డ్వాక్రా లీడర్‌ల చేతివాటం ఇవన్నీ ఆసరా.. ఇచ్చిందిలే.. అనే మాటలే వినిపిస్తున్నాయి. చివరికి ఆసరా ఫెయిల్‌నా అనేలా మారింది.



వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

నిడమర్రు జనవరి 28 : గోవింద నామస్మరణతో మందలపర్రు మారుమోగింది. ఆదివారం మందలపర్రులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి దివ్యకల్యాణం కనులారా చూసేందుకు వేలాదిమంది భక్తజనం హాజరయ్యారు. ఉదయం వేంకటేశ్వరస్వామి సుప్రభాత సేవతో ప్రారంభమై తోమాల సేవ, సహస్ర నామార్చన, తిరుమంజనసేవ జరిగింది. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఆకట్టుకుంది. మధ్యాహ్నం పగడాల ఆనంద తీర్థాచార్యులు చేసిన ఉపన్యాసం భక్తిభావం పెంపొందించింది. సాయంత్రం శ్రీవారి కల్యాణం నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.



పర్యాటకుల సందడి

కొల్లేరు చూద్దాం రండి..!

కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రానికి ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొల్లేరు సరస్సులో బోట్లలో షికారు చేస్తూ పక్షుల ఆవాస కేంద్రాలను, పక్షి పిల్లల కిలకిలారావాలను ఆస్వాదించారు.


కనువిందు చేస్తున్న కొల్లేటి పక్షులు



పెలికాన్, పెయింటెడ్ స్టార్క్, తెల్లకంకణాల పిట్ట, నారాయణపక్షి తదితర పక్షులను చూస్తూ పిల్లలు కేరింతలతో సందడి చేశారు. ఆటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్‌లో ఆటలు ఆడుకుంటూ గడిపారు. పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో పక్షుల నమూనాలను తిలకించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున రావడంతో బోటులో ప్రయాణానికి బారులు తీరి వేచి ఉండాల్సి వచ్చింది.

- కైకలూరు




నారాయణపురం సభలో మాట్లాడుతున్న రామాంజనేయులు, సెమీస్‌లో తలపడుతున్న పశ్చిమ గోదావరి, విజయనగరం జట్లు

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

ఉంగుటూరు, జనవరి 28 : నారాయణపురం శ్రీచింతలపాటి సీతారామ చంద్ర వరప్రసాద మూర్తిరాజు కళాశాల ప్రాంగణంలో 45వ రాష్ట్రసాయి అండర్-19 బాలుర హ్యాండ్ బాల్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. రెండో రోజుల పాటు జరిగే టోర్నీలో ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, విశాఖ, కృష్ణా, నంద్యాల, కడప, కర్నూలు, అనంతపురం, కడప, విజయనగరం మొత్తం పదకొండు జట్లు పాల్గొన్నాయి. ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చొరవ వల్ల ఈ పోటీలు జరగడం అభినందనీయమన్నారు. సెమీ ఫైనల్స్‌కు విశాఖ, నంద్యాల, పశ్చిమ గోదావరి, విజయనగరం జట్లు చేరాయన్నారు. రెండు రోజుల పాటు జరుగుతున్న పోటీలకు దాతలు నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకనంద, రుద్రరాజు రామచంద్రరాజు, వర్మ, పెన్మత్స రామచంద్రరాజు, ఆళ్ల సతీష్‌చౌదరి, రామాంజనేయులు, సి.శ్రీనివాసులు తదితరులు సేవలందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు ప్రారంభం



స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు

భీమవరం అర్బన్, జనవరి 28: అంతర్‌జిల్లాల 67వ స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు భీమవరంలోని చింతలపాటి బాపిరాజు పాఠశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో 13 జిల్లాల నుంచి వచ్చిన బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలకు సుమారు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 405 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పోటీల కన్వీనర్ జీపీసీ శేఖర్ రాజు తెలిపారు.

రేపు పెంటపాడు డీఆర్‌జీ కాలేజీలో జాబ్ మేళా

పెంటపాడు, జనవరి 28 :పెంటపాడు డీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఈనెల 30న బాజ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. జవహర్ నాలెడ్జి సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో పేటీఎం, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, అపోలో ఫార్మాసిస్ లిమిటెడ్, అస్ట్రోటెక్ స్టీల్స్ పాక్స్‌కాన్, ముత్తూట్ ఫైనాన్స్ మొత్తం ఆరు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీ, ఫార్మసీ, పీజీ చదివిన 27 నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం పది గంటలలోగా కళాశాల ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు.

రేపు, ఎల్లుండి గీత కార్మిక రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నరశింహమూర్తి

తణుకు, జనవరి28 : ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 15వ మహాసభలు తణుకులో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరశింహమూర్తి తెలిపారు. ఆదివారం లయన్స్ క్లబ్ వద్ద విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న మోకులు ధరించి గీతకార్మికుల మహా ప్రదర్శన మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై లయన్స్ ఆడిటోరియం వరకు కొనసాగుతుందన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ తదితరులు విచ్చేస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గీత వృత్తిని సర్వనాశనం చేశారని, ఉన్న ఉపాధిని దెబ్బతీసి కార్మికులు బతకలేని స్థితి కల్పించారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి, ఉపాధ్యక్షుడు గుబ్బల రాఘవులు, మామిడి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో సామాజిక న్యాయం అబద్ధం

» చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

ఏలూరుటూటౌన్, జనవరి 28 : వైసీపీలో సామాజిక న్యాయం అని చెప్పే సీఎం జగన్మోహన్ రెడ్డి మాటలన్నీ అబద్ధమని, ఆ పార్టీలో దళితులకు సముచిత న్యాయం జరగడం లేదని చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ఆదివారం ఏలూరు ఏఎస్సార్ స్టేడియం వద్ద మాలమహాసేన జాతీయ అధ్యక్షుడు అలగా రవికుమార్ ఆధ్వర్యంలో దళిత శంఖారావ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో విశ్వసనీయతలేని ఎమ్మెల్యే అభ్యర్థులను మారుస్తానని జగన్ చెప్పి ఒక్క దళితుల సీట్లు మాత్రమే మారుస్తూ దళితులకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి బకాసా అధ్యక్షుడు బాల కోటయ్య మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకుని అన్యాయం చేసిందన్నారు. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు త్వరలో ఉన్నాయన్నారు. దళిత నాయకులు మల్లెల వెంకట్రావు, రమేష్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచి తీరని ద్రోహం చేసిన జగన్‌కు దళితులు బుద్ధి చెబుతారన్నారు.

ఏలూరులో 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' టీమ్ సందడి



మాట్లాడుతున్న హీరో సుహాస్, హీరోయిన్ శివానీ

ఏలూరు కల్చరల్, జనవరి 28: రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 2న విడుదల కానున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం హీరో, హీరోయిన్ సుహాస్, శివానీ ఏలూరులో సందడి చేశారు. ఆర్ఆర్‌పేటలో నడుచుకుంటూ వెళుతూ సినిమాను విజయవంతం చేయాలంటూ ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో హీరో సుహాస్ మాట్లాడుతూ గతంలో విడుదలైన 'కలర్ ఫోటో' మంచి గుర్తింపు తెచ్చిందన్నారు. 2వ తేదీన విడుదల కానున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తన కెరీయర్‌లో మంచి చిత్రంగా నిలిచిపోతుందన్నారు. మరో రెండు సినిమాల్లో ప్రసన్నవరం, కేబుల్‌రెడ్డి చిత్రాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. హీరోయిన్ శివానీ మాట్లాడుతూ కుటుంబపరంగా చూడదగ్గ చిత్రమని ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. డెనిమ్ అధినేత కత్తిరి రామ్మోహన్ స్వాగతం పలికారు. వీరిని పలు అభిమాన సంఘాల నాయకులు శాలువా కప్పి సత్కరించారు.

పెద్దపులి పంజా

» దేవినేనివారిగూడెంలో పశువులపై దాడి
» ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారుల సూచన
» ముండూరు సమీపంలో బోను ఏర్పాటు

ద్వారకాతిరుమల, జనవరి 28 : పెద్దపులి పంజా విసిరిన ఘటన దేవినేనివారిగూడెంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలో రెండు ఆవులు, ఓ దూడపై పులి దాడి చేయడంతో అవి బెంబేలెత్తి కట్లు తెంపుకుని రోడ్డుపైకి పరుగులు తీశాయి. రైతులు, స్థానికుల గుండెల్లో భయం పెరిగింది. బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. వివరాలివి.. తిమ్మాపురానికి చెందిన రైతు పాకలపాటి మధుకు దేవినేనివారిగూడెంలో పొలం ఉంది. ఆయన ఆదివారం ఉదయం నాలుగు గంటలకు పొలానికి వచ్చేసరికి తన మూడు ఆవులు గాయాలతో రోడ్డుపై అరుస్తూ నిలబడి ఉండడాన్ని చూసి వాటిని పరిశీలించి సాటిరైతులకు సమాచారం ఇచ్చాడు. అందరూ వచ్చిచూడగా ఆవులపై పులి గోళ్లతో దాడి చేసినట్టు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రదామ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడికి గురైన ఆవులను, ఆ ప్రాంతంలో పులి అడుగుజాడలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులనుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాపికొండల అటవీప్రాంతం నుంచి పులి తప్పిపోయి వచ్చినట్టు సమాచారం ఉందన్నారు. ఇది పగలంతా విశ్రాంతి తీసుకుంటూ రాత్రివేళ రోజుకు దాదాపు 15 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని, కొద్దిరోజులు రైతులు, స్థానికులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరూ హాని కల్గించవద్దని అలాచేస్తే వన్యప్రాణిరక్షణ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. గ్రామాల్లో సాయంత్రం ఐదు ఐదు గంటల తర్వాత తిరగద్దని టాంటాం వేయించాలని సూచించారు. రైతుల పశువులకు ఈ పులివల్ల నష్టం జరిగితే నష్టపరిహారం చెల్లిస్తామన్నారు.



పులిని బంధించడం కోసం తీసుకొస్తున్న బోను

బోను ఏర్పాటు చేస్తున్నాం : రవీంద్ర దామా

పెదవేగి, జనవరి 28 : ముండూరు పరిసర ప్రాంతాల్లో పెద్దపులి కదలికలను గుర్తించామని, పులిని పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర దామా తెలిపారు. శనివారం ఉదయం దెందులూరు మండలం పెరుగ్గూడెం, చల్లచింతలపూడి గ్రామాల్లో పులి పాదముద్రలు గుర్తించగా, ఆదివారం మేదినరావుపాలెం మీదుగా పెదవేగి మండలం ముండూరు సమీపంలో పోలవరం కుడికాలువ సమీపంలో పంటపొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. రాజమహేంద్రవరం ముఖ్య అటవీ సంరక్షణాధికారి వై.శ్రీనివాసరెడ్డి, రాజమహేంద్రవరం డీఎఫ్‌వో ఎ.త్రిమూర్తులురెడ్డి, ఇతర అధికారులతో కలిసి పులి తిరిగినట్టు గుర్తించిన ప్రదేశాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండూరు, మేదినరావుపాలెం, ధర్మారావుపేట, చక్రాయగూడెం, సీతారామపురం గ్రామాల చుట్టుపక్కల పులి తిరుగుతున్నట్టు గుర్తించామన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాత్రి సమయంలో ఒంటరిగా పొలాలకు వెళ్ళవద్దు, ముఖ్యంగా పోలవరం కుడికాలువ పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. పెద్దపులిగా అనుమానిస్తున్న జంతువు సమాచారం తెలిస్తే అటవీశాఖాధికారులకు సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1800 425 5909 కు అందించాలని సూచించారు.



దేవినేనివారిగూడెం గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీఅధికారి రవీంద్ర



పులి దాడికి గురైన ఆవు



పులి పాదముద్ర

ఏజెన్సీలో వైద్య సౌకర్యాలు పెంచేందుకు కృషి చేస్తా

» ఐటీడీఏ పీవో సూర్యతేజ



కుక్కునూరు ప్రభుత్వాసుపత్రిలో గిరిజన మహిళను పరామర్శిస్తున్న పీవో సూర్యతేజ

కుక్కునూరు, జనవరి 28 : 'ఏజెన్సీలో వైద్య సౌకర్యాలు ఇంకా పెంచేందుకు కృషి చేస్తా.. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటుపై మరోసారి ప్రతిపాదన పంపుతా.. పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు కల్పన, మరింత వైద్యం అందుబాటులో తెచ్చేందుకు మొబైల్ అంబులెన్స్‌లు, గిరిజనుల్లో సాధారణ ప్రసవాలపై అవగాహన పెంపు, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేలా అటవీశాఖాధికారులతో మాట్లాడుతా' అని కేఆర్‌పురం ఐటీడీఏ పీవో సూర్యతేజ అన్నారు. కుక్కునూరు మండలం జిన్నెలగూడెం వలస ఆదివాసీ మహిళ కూరం కోసి అనే గర్భిణి డోలీలో నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణించి కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన విషయం విదితమే. ఈ క్రమంలో కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఆమెను ఆదివారం ఆయన పరామర్శించారు. జరిగిన ఘటనపై ఆమె నుంచి పలు విషయాలు అడిగారు. సకాలంలో స్పందించిన వైద్య సిబ్బందిని ప్రశంసించారు. ఈ క్రమంలో 2014లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నాలుగు పీహెచ్‌సీలకు అనుసంధానంగా కుక్కునూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదనను అప్పటి ప్రభుత్వం చేసిందని అది ముందుకు సాగడం లేదని, రెండు మండలాల ప్రజలు మెరుగైన వైద్యం కోసం వెళ్లాలంటే 50 నుంచి 70 కిలోమీటర్లు అటు తెలంగాణలోని భద్రాచలం, ఇటు ఆంధ్రలోని జంగారెడ్డిగూడెం వెళ్లాల్సి వస్తోందని పలువురు విలేకర్లు ఆయన దృష్టికి తీసుకురాగా పైవిధంగా ఆయన స్పందించారు. అనంతరం కుక్కునూరులోని గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. పలువురు విద్యార్థులు వసతి గృహంలో ఉండకపోవడాన్ని గుర్తించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథలిన్, డాక్టర్ పూర్ణశ్రీనివాస్, డాక్టర్ రమేష్, వైసీపీ నాయకులు రావు వినోద్, రాము తదితరులు ఉన్నారు.




ఆచంటలో హెల్త్ క్యాంపు నిర్వహణ

శానిటేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆచంటలో శానిటేషన్ పనులు

» స్పందించిన అధికారులు » మెగా వైద్య శిబిరం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆచంట, జనవరి 28 : డెంగీతో ఆచంటలో సజ్జ శ్రీకాంత్ అనే యువకుడు మృతి చెందడంతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. వేమవరం పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో ఆచంట శివారు రామాలయం, కుక్కలకోటి వీధిలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల ప్రజలు అందరికి వైద్య పరీక్షలు చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగబాబు ఈవోపీఆర్‌డీ మూర్తిబాబులు ఆధ్వర్యంలో గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు శానిటేషన్ పనులు చేపట్టి దోమల నివారణకు స్ప్రే చేశారు. మురుగు బోదెలను శుభ్రం చేశారు. ప్రజలకు ఏమైనా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు సూచించారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 28 : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తి అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు పోణంగి రోడ్డు వైఎస్ఆర్ కాలనీకి చెందిన విడుతూరి రత్న ప్రకాష్(52)గత కొన్నేళ్ళ నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ మేరకు మనస్తాపానికి గురై జీవితంపై విరక్తితో అధిక మోతాదులో మాత్రలను మింగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై అతడి భార్య ఇందిర ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 28 : భర్త, అత్త, మామలతో గొడవపడి ఒక వివాహిత ఇంటి నుంచి వెళ్ళిపోయిందని ఆమె తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన నంబూరి పూజిత(22) భర్త, అత్త, మామలతో గొడవపడి ఈనెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయింది. లింగపాలెం మండలం రంగాపురానికి చెందిన ఆమె తల్లి సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

ముసునూరు, జనవరి 28: మండలంలోని కాట్రేనిపాడు శివారు పామాయిల్ తోటలో పేకాట శిబిరంపై ముసునూరు పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 10 మోటారు వాహనాలు, రూ. 22 వేలు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వాసు తెలిపారు. మండలంలో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇంటిముందున్న కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

ఏలూరు క్రైం, జనవరి 28 : ఏ కారణమో తెలియదు కాని ఇంటి ముందు పార్కు చేసిన ఒక కారు అర్ధరాత్రి వేళ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన చేరి మంటలను అదుపుచేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు మండలం చాటపర్రు రోడ్డులోని ఆళ్ళ నాని కాలనీలో నివాసం ఉంటున్న లంకలపల్లి మల్లేశ్వరి పేరుపై 2021 మోడల్ కారు ఉంది. ఇంటిముందు యథావిధిగా శనివారం పార్కు చేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల సమయంలో ఆ కారు ఒక్కసారి మంటల్లో కాలిపోతూ కనిపించింది. ఆ ప్రాంతానికి చెందిన శ్రీధరబాబు అనే వ్యక్తి వెంటనే ఏలూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అదనపు ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే ఆ కారు పూర్తిగా దగ్ధమైంది. ఎవరైనా దగ్ధం చేశారా ? షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించి కారు దగ్ధమైందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మావుళ్ళమ్మకు కలెక్టర్ ప్రశాంతి పూజలు



నృత్య ప్రదర్శన అనంతరం కుమార్తెతో కలెక్టర్

భీమవరంటౌన్, జనవరి 28 : మావుళ్ళమ్మ అమ్మవారిని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం రాత్రి దర్శించుకుని పూజలు చేశారు. మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా కొటికలపూడి గోవిందరావు కళా వేదికపై కలెక్టర్ కుమార్తె సిరి భరత నాట్య ప్రదర్శన ఇచ్చిన సందర్భంగా ఆమెకుమార్తెతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి కోప్పేశ్వరరావు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, ఈవ యర్రంశెట్టి భద్రాజీ ప్రసాదాలు శేషవస్త్రం అందజేశారు. ఆర్డీవో కె. శ్రీనివాసులరాజు, తహసీల్దార్ రవికుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు

ఆకట్టుకున్న సిరి నృత్యప్రదర్శన

మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. పలు గీతాల్లో కలెక్టర్ కుమార్తె సిరి మిగిలిన చిన్నారులతో కలిసి ప్రదర్శన చేసింది. కుమార్తె నృత్య ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 28 : ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. బండివారిగూడెం గ్రామానికి చెందిన యువతి ఇంటర్మీడియెట్ వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటూ కూలి పనులకు వెళుతుంది. ఈనెల 20వ తేదీ రాత్రి 8 గంటలకు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఆచూకీ తెలియలేదు. యువతి తండ్రి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళను గాయపర్చిన వ్యక్తిపై కేసు

అత్తిలి, జనవరి 28 : అత్తిలిలో ఓ మహిళను కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎస్.వెంకట్రావు తెలిపారు. అత్తిలికి చెందిన సప్పా లక్ష్మమ్మ తన ఇంట్లో టీవీ పాడైపోయిందని కుమారుడు బాగుచేయించడం లేదని తిట్టుకుంటున్న ఆమెపై ఇంటిపక్కన నివశిస్తున్న సూరెడ్డి శ్రీనివాసరావు చెక్కతో తలపై కొట్టగా గాయపడింది. కుమారుడు ఆమెను 108 అత్యవసర వాహనంలో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె కుమారుడు ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

పాలకోడేరు, జనవరి 28 : వంట చేస్తుండగా మరిగిన నూనెలో నుంచి మంటలు వ్యాపించడంతో తాటాకిల్లుకు నిప్పు అంటుకుని దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.50వేల ఆస్తి నష్టం జరిగినట్టు అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారి సూర్యప్రకాషరావు ఆదివారం తెలిపారు. పెన్నాడపాలెం రోడ్డులో కొండేటి కాంతమ్మ, చిన్ని దంపతులు ఓ తాటాకిల్లులో నివసిస్తున్నారు. ఆదివారం వంట చేస్తుండగా ప్రమాదం జరిగిందన్న సమాచారం అందడంతో ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపు చేశామన్నారు.

కాట్రేనిపాడులో గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ముసునూరు, జనవరి 28: మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో ఆదివారం ముసునూరు పోలీసులు మూడు కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఏలూరు నుంచి నూజివీడుకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా ఎస్ఐ వాసు తన సిబ్బందితో కలసి దాడిచేసి కాట్రేనిపాడులో పట్టుకున్నారు. దాడిలో మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని, ఆటోను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందుతుల్లో ఒకరు ముసునూరు, మరొకరు గోపవరం గ్రామాలకు చెందిన వారు కాగా ఇద్దరు కాట్రేనిపాడు గ్రామానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. అయితే ఈ గంజాయి అమ్మకానికి సూత్రధారులు ఎవరు? గంజాయి ఎక్కడ నుంచి రవాణా అవుతోంది తదితర విషయాలపై విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

భద్రతలేని బతుకులు



పొగాకు పచ్చిఆకు బంటా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక పాకలు

ఉపాధి కోసం వచ్చి.. ప్రాణాలు ఫణం

» గుంటూరు, మహారాష్ట్ర, కృష్ణాల నుంచి వలసలు
» ఈనెలలోనే రెండు ఘటనలు
» గుంటూరు నుంచి వచ్చిన 8 మంది చిన్నారుల అస్వస్థత
» ఇటీవల కర్నూలు నుంచి వచ్చిన ఇద్దరు చిన్నారుల మృతి



ఇటీవల మృతి చెందిన అన్నదమ్ములు (ఫైల్)



రెల్చిన పొగాకు ఆకులను క్యూరింగ్‌కు సిద్ధం చేస్తున్న కార్మికులు (ఫైల్)

పొట్టకూటి కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. ఏక్షణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో భద్రత లేని జీవితాలను సాగిస్తున్నారు. వందలాది కిలోమీటర్లు దాటి ఇక్కడ తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. ఎక్కడో ఖాళీ స్థలాల్లో, పొలాల్లో గుడారాలు, తాటాకు పందిళ్లు వేసుకుని కుటుంబ సమేతంగా కాలం గడుపుతున్నారు. మళ్లీ ఇక్కడ పనులు ముగించుకుని వారి సొంత గ్రామాలకు వెళ్లిపోతారు. ఉపాధి దొరికే సమయంలో వారి పిల్లలు చదువులకు దూరం అవ్వడంతో పాటు ఇళ్ల వద్దే ఒంటరిగా ఉంటూ ప్రమాదకరమైన పరిస్థితులో జీవనం సాగిస్తున్నారు.

- జంగారెడ్డిగూడెం

వలస కూలీలు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో రెండు, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలలో మొత్తం 5 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. ప్రధాన వాణిజ్య పంటైన వర్జీనియా పొగాకుకు సంబంధించి పచ్చిఆకు బంటా కార్మికులుగా పనిచేసేందుకు అనేకమంది ఇతర జిల్లాల నుంచి సీజన్‌లో వలసలు వచ్చి పనులు చేసుకుంటుంటారు. మహారాష్ట్ర, గుంటూరు, కృష్ణా తదితర ప్రాంతాల నుంచి సంక్రాంతి పండుగ అనంతరం మన ప్రాంతానికి వస్తుంటారు. సుమారుగా 20 ఏళ్లగా ఉపాధి కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి సుమారు మూడు, నాలుగు నెలల పాటు పచ్చాకు బంటలో పనిచేస్తూ పనులు ముగియగానే మళ్లీ వారి ప్రాంతాలకు వెళ్తున్నారు. వీరితోపాటు నీలిమందు, ప్లాస్టిక్ డబ్బాలు, రగ్గులు అమ్ముకునే వారు సైతం సరైన ఇళ్లు లేక పిల్లలు, మహిళలతో పాట్లు పడుతున్నారు.

పిల్లల యోగక్షేమాలు నిల్..

ఉపాధి కోసం ఈ ప్రాంతాలకు వచ్చిన కార్మికులు తమ పిల్లల ఆరోగ్యంపై అంతగా శ్రద్ధ పెట్టే అవకాశం ఉండదు. వారి యోగక్షేమాలను చూసుకునే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో ఎంతోమంది చిన్నారులు అనారోగ్యాలు గురికావడం, పలు ప్రమాదాల్లో పడడం చూస్తుంటాం. ఈనెల 24వ తేదీన నల్లజర్ల మండలం పోతవరంలో గుంటూరు జిల్లాకు చెందిన పొగాకు బంటా వలస కూలీలు వచ్చిన కొందరు పనుల్లో ఉండగా ఇంటి వద్ద ఉన్న సుమారు 8 మంది పిల్లలు ఉమ్మెత్త కాయలు తినడంతో ఫుడ్‌పాయిజన్ కావడంతో ఆసుపత్రి పాలు అయ్యారు. వారిని హుటాహుటిన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి, అక్కడ నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం అందించారు. మరోఘటన ఈనెల 24వ తేదీన కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ గుడారాలు ఏర్పాటు చేసుకుని నీలిమందు, ప్లాస్టిక్ సామగ్రి విక్రయించే ఒక కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురై అన్నదమ్ములు మృతి చెందారు. ఈవిధంగా వలస కూలీలు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడుంటున్న కుటుంబాల పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు.

18 ఏళ్లుగా బంటా పనులకు వస్తున్నాం..

గడచిన 18 ఏళ్లగా పచ్చిఆకు బంటా పనుల నిమిత్తం ఈ ప్రాంతానికి వస్తున్నాం. సౌకర్యాలు ఎలా ఉన్నా కానీ పొట్టకూటి కోసం వచ్చి ఇక్కడ ఉండాల్సిన పరిస్థితి. మా పిల్లలను మా ఊరిలోనే అమ్మవాళ్ల వద్ద వదిలి వచ్చేశాం. అప్పుడప్పుడు వెళ్లి చూసుకుని వస్తా ఉంటాం.

- వెంకటరామయ్య, గుంటూరు, మేస్త్రీ

వైభవంగా శోభాయాత్ర



భీమవరం టౌన్, జనవరి 28 : హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భీమవరంలో శ్రీ రామదండు జైత్రయాత్ర నిర్వహించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్దనుంచి జువ్వలపాలెంరోడ్డు మీదుగా విస్సాకోడేరు వరకు సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన జట్కాపై సీతరామచంద్రస్వామి విగ్రహాలను ఉంచి యాత్రను కొనసాగించారు. వందలాదిమంద రామభక్తులతో యాత్ర సాగింది. విచిత్రవేషాలు, కోలాటం, శక్తి వేషాలు, డప్పుల కోలహలంతో సాగింది.

రేపు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు, జనవరి 28: నగర పంచాయతి సమావేశం మంగళవారం మధ్యాహ్నం జరుగుతుందని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలన్నారు.

కాలనీల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు, జనవరి 28: జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు జిల్లా వ్యాప్తంగా తక్షణమే పూర్తి చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న ఇళ్ళ కాలనీల్లో చాలామంది ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ళ నిర్మాణాలు చేపట్టడంలేదని, మధ్యలోనే నిలుపుదల చేశారని పేర్కొన్నారు. అర్హులందరికీ ఒక్కొక్కరికి రూ.6లక్షలు మంజూరు చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. ఆకివీడు జగనన్న కాలనీలో మంచినీరు, డ్రెయినేజీ, వీధిలైట్లు, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఓటు వజ్రాయుధం

భీమవరం క్రైం, జనవరి 28 : ఓటు వజ్రాయుధమని, ఓటు వేయడంలో నిర్లక్ష్యం వద్దని భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రయాణికులతో ఓటు హక్కు ప్రాముఖ్యత - వినియోగం అనే అంశంపై అవగాహన, ప్రయాణికుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రెవెన్యూశాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటును సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికులు కొలుసు ప్రభావతి (గుంటూరు), ఆర్ సూర్యకాంతం (విజయవాడ), వి.రాజబాబు (గుడివాడ) మాట్లాడుతూ సుస్థిర పాలకులను ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఓటర్ చైతన్య ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే సూపర్‌వైజర్ ఎస్.రాము, ఎస్‌కెచాన్ బాషా, మల్లుల సీతారాంప్రసాద్, రైల్వే సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

రాజమండ్రికి తరలిన ఉపాధ్యాయులు

నరసాపురం రూరల్, జనవరి 28: యూటీఎఫ్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం రాజమండ్రిలో నిర్వహించిన ఓపీఎస్ సాధన పిలుపు సమావేశానికి ఉపాధ్యాయులు భారీగా తరలివెళ్లారు. పట్టణ, మండల,మొగల్తూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు ముందుగా మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసుకున్న బస్సుల్లో వీరంతా రాజమండ్రి సభకు తరలివెళ్లారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని నినాదాలు చేశారు.

ఓడూరులో అభివృద్ధి పనులు ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యే రంగరాజు

పెనుమంట్ర, జనవరి 28 : ఓడూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, వెల్నెస్ సెంటర్‌ను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రారంభించారు. అలమూరు గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించబడిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను జడ్పీ చైర్మన్ పద్మశ్రీ ప్రారంభించారు నాడు నేడు నిధులతో నిర్మాణం చేసిన పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు వెలగలేరు గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. మార్టేరు నుంచి పాలకొల్లు రోడ్డు నిర్మాణానికి కవిటం గ్రామం వద్ద శంకుస్థాపనను ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు చేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య పాల్గొన్నారు

'టీడీపీ-జనసేన గెలుపు ఖాయం'

భీమవరం, జనవరి 28: రానున్న ఎన్నికలలో తెలుగుదేశం జనసేన పార్టీల కూటమి విజయం సాధించి అధికారాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. భీమవరంలో ఆదివారం ఓటరు దినోత్సవ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ కామినేని ఆంధ్రప్రదేశ్ ఆక్వా సి ఫుడ్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమాల శ్రీరామ్ మూర్తి నివాసానికి విచ్చేశారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్వాగతం పలికారు. జనసేన నాయకుడు, ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇర్రింకి సూర్యారావు తదితరులు ఈ సందర్భంగా ఆయను కలిశారు. టీడీపీ జనసేన నాయకులతో కొద్దిసేపు ఇష్టాగోష్టిగా కామినేని మాట్లా డారు. ప్రస్తుత పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు.

పాస్టర్ థామస్ మృతికి సంతాపం



ఉండి, జనవరి 28 : పాస్టర్ థామస్ విల్సన్‌రాజు మృతి సంఘస్థులకు తీరని లోటు అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. శనివారం యండగండిలో పాస్టర్ థామస్ మృతిచెందారు. ఆదివారం ఉదయం క్రైస్తవ సంప్రదాయం ప్రకారం కార్యక్రమాలు పూర్తిచేశారు. డీసీసబీ చైర్మన్ నరసింహరాజు ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగులమండ చిన్నకృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, గొర్రెముచ్చుల సుందరకుమార్ పాల్గొన్నారు.

నేడు డ్రైవర్లకు మెడికల్ చెకప్‌లు

పాలకొల్లు రూరల్, జనవరి 28:ఈనెల 29న జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు పురస్కరించుకుని నరసాపురం, పోడూరు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ డ్రైవర్లకు మెడికల్ చెకప్‌లు నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

గణపవరం, జనవరి 28: విజయవాడలో ఫిబ్రవరి 4న క్యాన్సర్‌పై నిర్వహించే అవగాహన ర్యాలీకి సభ్యులంతా హాజరు కావాలని పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు తెలిపారు. ఆదివారం సరిపల్లెలో పీఎంపీలకు డాక్టర్ జపతిరాజు గ్యాస్ట్రో వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, కార్యదర్శి బీఎస్ శ్రీనివాసరావు, నిడమర్రు మండల అధ్యక్షుడు మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా బదిలీ చేశారు..

భీమవరం క్రైం, జనవరి 28 : ఎన్నికల నిబంధనలు పాటించకుండా తనను అక్రమంగా బదిలీ చేశారంటూ ఒక సీఐ ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన భీమవరంలో సంచలనమైంది. ఇటీవల బదిలీల్లో భాగంగా ఒక సీఐని జిల్లాలోని మరొక స్థానానికి ఎస్పీ కార్యాలయం బదిలీ చేసింది. శనివారం సాయంత్రం పోలీసు ఉన్నతాధికారి కార్యాలయం ఎదుట సీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారిపై పలు ఆరోపణలు చేసినట్లు తెలియవచ్చింది. ఈ వ్యవహారం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. దీనిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారి వివరణ కోరగా తనకు కావల్సిన చోటుకి బదిలీ చేయాలని సీఐ కోరాడని దీనిపై రేంజ్ అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు.

కెరీర్ గైడెన్స్‌పై తరగతులు

ఆచంట, జనవరి 28: వేమవరం జిల్లా పరిషత్ హైస్కూలులో సైకాలజిస్ట్ అక్కింశెట్టి రాంబాబు 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు కంచర్ల శివన్నారాయణ, సతీశ్ కుమార్, సెక్రటరీ బొక్కా రామకృష్ణ, మానవత ఎడ్యుకేషన్ మెంబర్ సత్యనారాయణ మూర్తి, ఆత్మీయ సేవా కమిటి చైర్మన్ కేఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు.





నత్తారామేశ్వరంలో పాదయాత్ర చేస్తున్న మాజీ మంత్రి పితాని... నరసాపురంలో మాట్లాడుతున్న పాత్తూరి.. పెంటపాడులో మాట్లాడుతున్న బాబ్జి

వైసీపీకి కౌంట్ డౌన్

జయహో బీసీ సమావేశంలో తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, జనవరి 28: బీసీలతో పాటు అని వర్గాల ప్రజలని మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌ని ఓడించడానికి జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జయహో బీసీ సమావేశాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చేటి నరసింహరావు అధ్యక్షతన నిర్వహించారు. వైసీపీకి కౌంట్ డౌన్ ప్రారంభమైందని అన్నారు. ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ త్వరలో ఏర్పడనున్న జనసేన టీడీపీల ప్రభుత్వంలోనే బీసీలకు నిజమైన అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందనున్నాయన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు వానపల్లి సూరిబాబు, సతివాడ నవీన్ టీడీపీ బీసీ నాయకులు వేండ్ర శ్రీనివాస్, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడురి సుబ్బారావు, రేవు వెంకన్న, కౌరు పృథ్వీ శంకర్ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: బీసీలకు అన్ని విధాలుగా టీడీపీ, జనసేన పార్టీలతోనే న్యాయం జరుగుతుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, జనసేన కన్వీనర్ నాయకర్, కొవ్వలి నాయుడు అన్నారు. ఆదివారం బియ్యపుతిప్ప గ్రామంలో జయహో బీసీ సభకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వైసీపీ ఐదేళ్ళ బీసీలను హామీలతో మభ్యపెట్టిందే తప్ప వారి అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయించలేదన్నారు. నిధులు లేని కార్పోరేషన్లు ఏర్పాటు చేసి బీసీలను ఉత్సవ విగ్రహాలు చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నంటిని నేరవేరుస్తుందన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకోస్తారన్నారు.

పెనుగొండ: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని టీడీపీ నాయకులు ఉప్పలపాటి చంటి, కట్టా రామకృష్ణ, కుషల్ కుమార్ అన్నారు. వడలి గ్రామంలో బూత్ నెంబర్ 9లో బాబు షూరిటి భవిష్యత్తు గ్యారెంటి కార్యక్రమం నిర్వహించారు.

పెనుమంట్ర: ఎన్నికల ముందు మద్యం దుకాణాలు తీసివేస్తామని జగన్ రెడ్డి మాట ఇచ్చి నిలబెట్టుకోకుండా మోసం చేశారని మాజీమంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం నత్త రామేశ్వరం, పంపనవారిపాలెంలో పితాని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్టీసీ చార్జీలు నాలుగు సార్లు పెంచి, విద్యుత్ చార్జీలు, చివరికి మద్యం ధరలు కూడా పెంచి పేదల బ్రతుకులను నాశనం చేశారని ఆరోపించారు. తొలుత నత్తా రామేశ్వరంలోని శ్రీ రామేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఆచంట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎంపీటీసీ టీఎన్ రెడ్డి జనసేన మండల అధ్యక్షుడు కోయ కార్తీక్, బయ్యే బాలాజీ, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: అజ్జమూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఆకివీడు మండల బీసీ నాయకుల సదస్సు నిర్వహించారు. ఎన్‌టిఆర్ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి తెలుగుదేశంపార్టీని ఏర్పాటు చేశారని అన్నారు. అన్న ఆశయాలను అమలు చేసిన ఘనత చంద్రబాబునాయుడిదేనని అన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అనేక కోట్ల నిధులు మంజూరు చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదేనన్నారు. ఎమ్మెల్యే రామరాజు, జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు, మోటుపల్లి రామ వరప్రసాదు, నౌకట్లరామారావు, బొల్లా వెంకట్రావు, టీడీపీ స్టేట్ బీసీసెల్ అధికార ప్రతినిధి హరిశ్చంద్రప్రసాదు, బచ్చు సరళ పాల్గొన్నారు.

● జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. అజ్జమూరు గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం, బాబుతోనే భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని అరాచకపాలనను అంతమొందించేందుకు ప్రజలు కంకణం కట్టుకున్నారని అన్నారు. కేవలం 74రోజుల వ్యవధిలోనే ప్రజలు తమ తీర్పును వెలువరించనున్నారని అన్నారు. మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాదు, నౌకట్ల రామారావు పాల్గొన్నారు.

వీరవాసరం: రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన, టీడీపీ చేసే ప్రయాణాన్ని ఆదరించాలని జనసేన మండలశాఖ అధ్యక్షుడు జవాబుది బాలాజీ అన్నారు. ఆదివారం మత్స్యపురి గ్రామంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మేనిఫెస్టో తెలియచేస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చింతా కనకయ్య, జవ్వాది బాలాజీ, రాకాడి ఈశ్వరరావు, దొంగ చింతన్న, రావూరి దానయ్య నాయుడు, ముదాల ఏసు రత్నం పాల్గొన్నారు.

పెంటపాడు: బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్ళాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. సోమవారం మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అధ్యక్షతన క్లస్టర్ ఇన్‌చార్జిలు గారపాటి భాస్కరరావు, నల్లమిల్లి చినగోపిరెడ్డి, కుడుళ్ళ చంద్రశేఖర్ సమక్షంలో సమగ్ర శిక్షణ సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ గ్రామాల్లో గృహసారథులను నియమించాలని, ఓటర్ల జాబితాపై పార్టీ శ్రేణులంతా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. దాసరి అప్పన్న, గంధం సతీష్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, బుద్దన ధనరాజు, సర్పంచ్ పీతల సత్యనారాయణ, కొల్లూరి నాగరాజు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



లోసరిలో కంటి వైద్య పరీక్షలు

భీమవరం రూరల్, జనవరి 28: నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (ఎన్‌ఏటీఎస్), రాజమండ్రి గౌతమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం మండలం లోసరి గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎన్‌ఏటీఎస్ డైరెక్టర్ కలిదిండి ప్రేమ్ తండ్రి వాసుదేవ వర్మ ప్రారంభించారు. 80మందికి పైగా కళ్ళజోళ్ళను అందించారు. 50మందికి కంటి ఆపరేషన్‌లను ఉచితంగా చేయడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.

తణుకు: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు ఆధ్వర్యంలో మండపాక పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం రాజమహేంద్రవరం నుంచి ఈఎన్‌టీ వైద్యుడు సత్తి రవికాంత్ బృందం 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సర్పంచ్ జానా వెంకట లక్ష్మి జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

● సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఉచిత వైద్య సేవలందించాయి. డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, సజ్జాపురం ప్రాంతాల్లో పర్యటించి 9 మందికి వైద్యం చేశారు. సంఘ సభ్యులు శనివారపు చలపతిరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కోశాధికారి కోడూరి సత్యనారాయణ, అర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో నూతన ఉత్తేజం: ఎస్పీ



పోటీలకు సిద్ధమైన పోలీసు జట్లు

భీమవరం క్రైం, జనవరి 28: నిత్యం విధులు నిర్వహించే పోలీసులకు అప్పుడప్పుడు విరామ సమయాలలో క్రీడలు నిర్వహించడం వలన వారిలో సరికొత్త ఉత్తేజం వస్తుందని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాశ్ అన్నారు. డీఎన్నార్ కళాశాలలో రెండు పోలీసు జట్లుగా ఏర్పడి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన భీమవరం సబ్ డివిజన్ నిర్ణీత 15 ఓవర్ల మ్యాచ్‌లో 105 పరుగులు చేయగా నర్సాపురం సబ్‌డివిజన్ బ్యాటింగ్ చేసి నిర్ణీత 15 ఓవర్లలో 79 పరుగులు చేశారు.

రైళ్ళలో నేరాలు, ప్రమాదాలపై అవగాహన



తాడేపల్లిగూడెంలో రైలు ప్రయాణికులకు సూచనలిస్తున్న జీఆర్‌పీ ఎస్ఐ శ్రీహరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 28: రైలు ప్రయాణికులు తమ వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని జీఆర్‌పీ ఎస్ఐ జి. శ్రీహరిబాబు సూచించారు. తాడేపల్లి గూడెం రైల్వేస్టేషన్ లో ప్రయాణికులకు ఆదివారం పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా రైలు ఎక్కి, దిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

భీమవరం క్రైం: ప్రయాణికుల భద్రతతో పాటు వారి విలువైన వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోనుటం, రైలు ఎక్కే సమయంలో దిగే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి ఆర్‌పీఎస్ ఎస్ఐ పీటీవీ రమణ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైళ్ళలో జరిగే నేరాలు, ప్రమాదాల గురించి ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రేపటి నుంచి మహాత్మాగాంధీ వర్ధంతి పక్షోత్సవాలు

భీమవరం టౌన్, జనవరి 28 : ఈనెల 30 నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు మహాత్మాగాంధీ వర్ధంతి పక్షోత్సవాలను భీమవరంలో నిర్వహిస్తున్నామని నిర్వాహక సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, బోండా సుబ్బారావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. క్విట్ ఇండియా స్థూపం వద్ద మహాత్మాగాంధీ వర్ధంతి పక్షోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

సుభాష్‌రాజు నియామకం పట్ల హర్షం



సుభాష్‌కి అభినందనలు తెలుపుతున్న బీజేపీ నాయకులు రామ్మూర్తి, కాళ్ళ మండల నాయకులు

కాళ్ళ, జనవరి 28 : బీజేపీ నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్‌గా పేరిచర్ల సుభాష్ రాజు నియామకం పట్ల ఉండి నియోజకవర్గ బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కోరా రామ్మూర్తి, కోకన్వీనర్ వెంకటేశ్వరరాజు, ఎస్సీ మోర్చా జిల్లా వెంకటేశ్వర్లు, లక్ష్మీపార్వతి, ముదునూరి నాగమణి, కాళ్ళ, ఉండి, ఆకివీడు, ఆకివీడు టౌన్ అధ్యక్షుడు సుంకర కాశీ, యర్రా విక్రమ్, కట్రెడ్డి ఏడుకొండలు, చిట్టిబాబు, పానకాల కృష్ణ, హరి తదితరులు సుభాష్‌రాజును కలిసి అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నరసాపురం టౌన్, జనవరి 28: పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందంగా జరిగింది. 1975 నుంచి 79 వరకు చదువుతున్న 11 మంది పూర్వ విద్యార్థులు స్కూల్ ప్రాంగణంలో కలుసుకున్నారు. చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. ముందుగా పరిచయాలు చేసుకుని తోటి స్నేహితుల్ని గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. స్కూల్‌లో ఇక నుంచి పదిలో ర్యాంకులు సాధించే ముగ్గురు విద్యార్థులకు ప్రతి ఏటా రూ.1500 చొప్పున ప్రోత్సాహక నగదును ఇవ్వాలని నిర్ణయించారు. స్కూల్‌కు వాటర్ ట్యాంక్ బహూకరించారు.

మోటార్ మెకానిక్‌లు ఐక్యంగా ఉండాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

తణుకు, జనవరి 28: మోటారు మెకానిక్ సంఘ సభ్యులంతా ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా నూతన అధ్యక్షుడు నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. జిల్లా జనరల్ సెక్రటరీగా పట్నాల చిట్టి ఆచార్యులు, కోశాధికారిగా మీసాల రాము, ముత్యాలరావుతో పాటు పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి, తెలంగాణ సంఘాల ప్రతినిధులతో పాటు పలువురు మెకానిక్‌లు పాల్గొన్నారు.

వడలిలో దళితుల ఆందోళన

పెనుగొండ, జనవరి 28: వడలి గ్రామంలో ఆర్చి నిర్మాణం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన విభేదాలు సమస్యాత్మకంగా మారాయి. 2016లో ఆర్చి నిర్మాణానికి పంచాయతీ తీర్మానంతో దళిత సంఘాల నాయకులు అనుమతులు పొందారు. అదే ప్రాంతంలో గౌడ సంఘానికి చెందిన రామాలయ నిర్మాణం జరగడంతో ఇరువర్గాల మధ్య నాలుగు నెలలుగా వాదనలు ప్రారంభమయ్యాయి. ఎన్ని సార్లు సమావేశాలు నిర్వహించుకున్నా సమస్య కొలిక్కి రాలేదు. ఈ తరుణంలో గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి వేయడంతో వివాదంగా మారింది. దీనిపై దళిత సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వడలి-సిద్ధాంతం రహదారిపై ధర్నా నిర్వహించారు. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కేసు నమోదు చేసే వరకు ఆందోళన విరమించేలాది లేదంటూ ఆందోళన కొనసాగించారు. కాగా ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం జరిగిందని నరసాపురం డీఎస్పీ రవి మనోహరచారి తెలిపారు. సమస్యను శాంతి యుతంగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

బీజేపీ కాకినాడ ఇన్‌చార్జిగా రావూరి సుధ



పాలకొల్లు టౌన్, జనవరి 28: పాలకొల్లుకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు రావూరి సుధ కాకినాడ పార్లమెంట్ జిల్లా ఇనిచార్జిగా నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదివారం నియామక ఉత్తర్వులను జారీచేసింది. రావూరి సుధ గతంలో బీజేపీ జిల్లా యువమోర్చ అధ్యక్షుడుగా, దక్షిణ మధ్య రైల్వే బోర్డు జోనల్ సభ్యుడుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా అనేక పదవులు చేపట్టారు. రావూరి సుధ నియామకం పట్ల నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సీఐ మంగాదేవి బాధ్యతల స్వీకరణ



పాలకొల్లు టౌన్, జనవరి 28: పాలకొల్లు టౌన్ సీఐగా కె.మంగాదేవి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన మంగాదేవి 2012లో సీఐగా పదోన్నతి పొందారు. పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో పలు పోలీస్ స్టేషన్‌లలో పనిచేశారు. ప్రస్తుతం ధవళేశ్వరం నుంచి పాలకొల్లు టౌన్ సీఐగా బదిలీపై వచ్చారు.

ధ్యాన శిక్షణ



మాట్లాడుతున్న మాస్టర్ కె.శ్రీకాంత్

పెనుమంట్ర, జనవరి 28 : పెనుమంట్ర గ్రామంలో పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద హైదరాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ కె.శ్రీకాంత్ ధ్యానశిక్షణ నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతిరోజు ధ్యానసాధనతో ఎంతటి కష్టమైన పనినైనా ఎంతో సునాయాసంగా చేయగలమని అన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ వచ్చేనెల24న పేరుపాలెం బీచ్ లో పాండురంగస్వామి గుడివద్ద పౌర్ణమి ధ్యానం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఘనంగా గ్రామ దేవతల జాతర



నందమిల్లిపాడులో ఘటాల ఊరేగింపు

ఆకివీడు రూరల్ జనవరి 28: నందమిల్లిపాడు గ్రామదేవతల జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామం ఏర్పడిన నాటి నుంచి గ్రామదేవతలైన మర్లమ్మ, పోలేరమ్మ, దేశాలమ్మ, పెద్దింట్లమ్మ అమ్మవారి జాతరను ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తు న్నారు. గ్రామంలో శక్తివేషధారణలు, ఘటాలు ఊరేగింపు, వాయిద్య బృందాలతో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చిట్టిబాబు, ఉపసర్పంచ్ నారాయణరాజు, చినిమిల్లి పెంటయ్య, పసుపులేటి సూరిబాబు, కొండా వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరవల్లిలో జాతర

అత్తిలి, జనవరి 28 : ఆరవల్లిలో గల ఐదుగురు దేవతలు దుర్గమ్మ, మావుళ్ళమ్మ, మారెమ్మ, మహంకాళమ్మ, చెవులమ్మ అమ్మవార్ల జాతర వైభవంగా జరిగింది. ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది. సోమవారం ఉదయం అమ్మవారిని అత్తవారింటికి తీసుకెళ్ళే కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు అమ్మిరెడ్డి చెప్పారు.

అన్నసమారాధన



నాగారమ్మను దర్శించుకున్న కొవ్వలి నాయుడు

నరసాపురం టౌన్; జనవరి 28: చినమామిడిపల్లిలో నాగారమ్మ జాతర ముగింపులో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పట్టణ, మండల,మొగల్తూరు ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ సీనియర్ నాయకులు కొవ్వలి నాయుడు అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలో గంగాలమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి నైవే ద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు.

కప్పాలమ్మ జాతర ప్రారంభం

గణపవరం, జనవరి 28 : వరదరాజపురం గ్రామ ఇలవేల్పు కప్పాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాలు తొలిరోజు మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అమ్మవారికి సేవా కార్యక్రమం వైభవంగా జరుగుతాయని, మంగళవారం నైవేద్యాలు సమర్పించుకుంటారని నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామానికి బంధువులు రాకతో పండుగ వాతావరణం నెలకొంది.




స్వామీజీతో మాట్లాడుతున్న వేగిరాజు శివవర్మ.. మాట్లాడుతున్న జ్యోత్స్న

ప్రతి ఒక్కరూ జీవిత సారాన్ని తెలుసుకోవాలి

కాళ్ళ, జనవరి 28: ప్రతిఒక్కరూ జీవితసారాన్ని తెలుసుకుని, ధర్మాన్ని పాటించాలని వక్తలు కోరారు. శ్రీ రామకృష్ణ సేవాసమితి (కాళ్ళకూరు) శ్రీ వివేకానంద సేవా సమితి (పెదఅమిరం) ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన మద్యాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనం ఆదివారం ముగిసింది. పాతళ్ళమెరక ఆశ్రమ కళ్యాణ మండపంలో చివరి రోజు మరింత ఆధ్యాత్మికోత్సాహంతో సభ నిర్వహించారు. శితికంఠానంద స్వామీజీ (హైద్రాబాద్)మాట్లాడుతూ పదవీ, పేరు ప్రఖ్యాతులు, డబ్బు లాంటి ఆటవస్తువులతో మనం ఆడుకొంటున్నంత కాలం అమ్మలాంటి భగవంతుడు మనల్ని దరిచేర్చుకోడని అన్నారు. వాలివాల వెంకట రామకృష్ణ శాస్త్రి (బెంగళూరు)మాట్లాడుతూ ఆధునిక జీవితం సనాతన ధర్మం గురించి మాట్లాడుతూ మన వేష భాషలు మారినా మన లోపల ఉన్న సనాతన ధర్మం ఎప్పటికీ చెక్కు చెదరదని తెలిపారు. నాయని జ్యోత్స్న(తణుకు) మాట్లాడుతూ ఇతరులను విమర్శించే కంటే వారిని అర్థం చేసుకొంటే మంచిదని వివేకానంద చెప్పిన భావానికి అర్థం కేవలం కండబలం కాదనీ, మూడు రోజులుగా జరుగుతున్న ఈ భక్తి కార్యక్రమాల నిర్వహణ కూడా దైవ బలమేనని అన్నారు. వివేకానంద సేవా సమితి కార్యదర్శి వేగిరాజు శివవర్మ, వేరేన్న సోమరాజు పర్యవేక్షణలో ముగిశాయి.

ఆలయ అభివృద్ధికి విరాళం

పెనుగొండ, జనవరి 28: వడలి గ్రామ దేవత మండాలమ్మ ఆలయ అభివృద్ధికి డాక్టర్ కలిగొట్ల సుమేధ మేఘన రూ.10వేలు అందించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ఆ తర్వాత ఆలయ కమిటీ చైర్మన్ వీరవాసరపు సూరిబాబుకు విరాళం అందించారు.

'మన్ కీ బాత్' అభినందనీయం



మన్ కీ బాత్ వీక్షిస్తున్న తాతాజీ

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 28: ప్రజల్లో మనో ధైర్యం నింపేందుకు దేశంలో ఎందరో స్ఫూర్తినింపిన వారి గాథలను ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా తెలపడం అభినందనీయమని బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఓబీసీ మోర్చ నాయకులు అయినాల బాలకృష్ణ, యువమోర్చ అధ్యక్షుడు గరగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవతకు త్వరలో అంబులెన్స్

అత్తిలి, జనవరి 28 : కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి సహకారంతో త్వరలో మానవతకు అంబులెన్స్ రానున్నదని సంస్థ అత్తిలి చైర్మన్ ఆనాల ఆదినారాయణ తెలిపారు. అత్తిలి మానవత సమావేశం అధ్యక్షుడు బోడపాటి సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగింది. అత్తిలికి శాంతి రథం ఇవ్వడానికి అంగీకరించిన కూనపరెడ్డి జయరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. బాలికోన్నత పాఠశాలలో చదివే ఇద్దరు విద్యార్థులకు ఉపాధ్యాయిని రమణి రూ. 2,500 చొప్పున అందించారు. రిటైర్డ్ ఎంపీడీవో పంజా ప్రసాద్, కోరిపల్లి హరి, బడేటి వెంకటేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలుస్తాం: బొలిశెట్టి



మాధవరంలో పర్యటిస్తున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 28: ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మాధవరంలో రెండో రోజు పల్లెపోరు నిర్వహించారు. మహిళలు, యువత భారీగా హాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, ఉప సర్పంచ్ బండారు నాగరాజు, భరతుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



భీమవరం అర్బన్, జనవరి 28: దళిత జేఏసీ ఆధ్వర్యంలో 40 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు రాజ్‌ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్ సహకారంతో కుట్టు మిషన్‌లను ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలో పంపిణీ చేశారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడే యుగంధర్, పశుగణాభివృద్ధి డైరెక్టర్ గంటా సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.